ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024



జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా వస్తున్న కృష్ణాజలాలు
జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా గండికోటలోకి ప్రవేశిస్తున్న కృష్ణాజలాలు

భయపెడుతున్న డెంగీ, మలేరియా

- గత ఏడాది కంటే పెరిగిన కేసులు
- 20 ఏళ్ల తరువాత వెలుగుచూసిన మెదడువాపు
- వైద్యశాఖలో కలవరం




కడప(కలెక్టరేట్), ఆగస్టు 11: జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు చాపకింద నీరులా రోజు రోజుకు పెరుగుతున్నాయి. గత ఏడాదికంటే ఈ ఏడాది ఇప్పటికే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. వైద్యశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నప్పటికీ వ్యాధులను అదుపు చేయడంలో విఫలమౌతున్నారు. జిల్లా పరిధిలో 50 పీహెచ్‌సీలు, 8 సీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు నిరంతరం ఇంటింటా తిరుగుతున్నారు. అయినా 116కు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది మలేరియా కేసులు కేవలం 3 నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటికే 9 అధికారికంగా గుర్తించారు. ఇక పోతే పందుల (జపనీస్ హైపటైటీస్ దోమకాటు) ద్వారా వ్యాపించే మెదడు వాపు వ్యాధి 20 ఏళ్ల తరువాత మళ్లీ జిల్లాలోని ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో నమోదు కావడంతో వైద్యశాఖతో పాటు జిల్లా ప్రజలను కలవర పెడుతోంది.

వైద్య సిబ్బంది ఉన్నా..

జిల్లాలో 645 సచివాలయాలు, 50 ప్రాథమిక ఆసుపత్రులు, 8 సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 13 మంది సబ్ యూనిట్ మలేరియా అధికారులు, 1250 మంది ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు 2,700 మంది, మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు మరో 600 మంది.. డాక్టర్లతో కలుపుకుంటే జిల్లాలో 5 వేల వరకు వైద్యసిబ్బంది ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే అంటూ వీధివీధినా కార్యక్రమాలు చేస్తున్నారే తప్ప వ్యాధుల అదుపునకు సంబంధించి ప్రజల్లో సరైన చైతన్యం తేవడంలో విఫలమౌతున్నారు. వైద్యశాఖ, మున్సిపాలిటీలు, పంచాయతీల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ముందస్తు ప్రణాళికలు చేపట్టకపోవడం, పారిశుధ్యం పనుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా దోమ కారకమైన లార్వా పుట్టుకొస్తోంది. దీంతో దోమలు పెరిగి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా లాంటి తీవ్ర జ్వరాలతో పేదల జీవితాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి.

ఆసుపత్రుల్లో నిలువు దోపిడీ

మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు వస్తే రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్ర యిస్తే జలగల్లా డబ్బులు పీల్చుతున్నారు. వైద్యశాఖ పర్యవేక్షణ నామమాత్రంగా సాగుతుండడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు. జ్వరంతో ఆసుపత్రులకు వెళితే ఏకంగా కిడ్నీలు, హెచ్ఐవీ లాంటి పరీక్షల పేరుతో నిలువు దోపిడీకి దిగుతున్నారు. ప్రైవేటు వైద్యులు కమీషన్లకు కక్కుర్తిపడి ల్యాబ్ నిర్వాహకులతో కుమ్మక్కయి పేదలను దోచుకుంటున్నారు. గ్రామీణ ప్రభుత్వాసుపత్రుల్లో సమయానికి వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు బయోమెట్రిక్ వేసేందే తడవు ప్రైవేట్ ప్రాక్టీసుకు పరుగులు తీస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో పేదలకు ఉచిత వైద్యం అందకపోగా.. తమ ప్రైవేటు ఆసుపత్రులకు రోగులను మరల్చుకుంటూ సామాన్యులను అప్పుల్లోకి నెట్టేస్తున్నారనే విమర్శలున్నాయి. పులిగాడికంటే గిలిగాడు అంటే భయం ఎక్కువ అన్నట్లుగా డెంగీ, మలేరియా జ్వరాలను కొందరు వైద్యులు భూతద్దంలో చూపి కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లేలా సిఫార్సులు చేయడంతో పేదల జేబులు ఖాళీ అయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అప్రమత్తమై గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగీ, మలేరియాకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు..

సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. ప్రజల్లో మరింత అవగాహన కల్గించేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి. వారంలో ఒకసారి ఇంట్లో నీటి ట్యాంకులను ఆరబెట్టడం, నీటి నిల్వలు లేకుండా చూడడం ద్వారా దోమల నియంత్రణ సాధ్యమవుతుంది.

- మనోరమ, జిల్లా మలేరియా అధికారి

గండికోట ప్రాజెక్టుకు చేరిన కృష్ణాజలాలు

- ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు

కొండాపురం, ఆగస్టు 11: కృష్ణాజలాలు ఆదివారం ఉదయం సుమారు ఏడు గంటల ప్రాంతంలో గండికోట ప్రాజెక్టులోకి ప్రవేశించాయి. శనివారం సాయంత్రం నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ వద్ద నీటిని జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు విడుదల చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో నీళ్లు జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 55 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం ద్వారా వచ్చి ఆదివారం ఉదయం గండికోట ప్రాజెక్టులోకి ప్రవేశించాయి. 11,500 క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్నారు. గండికోటప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు ఉందని అధికారులు తెలిపారు. ఇదే విధంగా నీటిని విడుదల చేస్తే రోజుకు ఒక టీయంసీ చొప్పున ప్రాజెక్టులోకికి నీరు చేరుతుందన్నారు. కాగా ఆదివారం సాయంత్రానికి గండికోట ప్రాజెక్టులో సుమారు 2 టీయంసీలకు పైగా నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. గండికోట ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టీయంసీలు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే గండికోట ప్రాజెక్టు నిండేంత వరకు నీటి విడుదల ఉండే అవకాశం ఉంది.

కృష్ణా బోర్డు రాయలసీమలో ఏర్పాటు చేయాలి : తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 11: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమ ప్రాంతంలో వెంటనే ఏర్పాటుచేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత నర్రెడ్డి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అయినా ఇప్పటికి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు రాలేదన్నారు. మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం, టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల చేతగానితనం ఇందుకు కారణాలన్నారు. కృష్ణానదిపై అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ రాష్ట్రాలలో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న నిర్మించబోయే ప్రాజెక్టులు ఈ బోర్డు పరిధిలోకి వస్తాయన్నారు. ఈ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటుచేయాలని చంద్రబాబు, విశాఖలో ఏర్పాటుచేయాలనిజగన్ బోర్డుకు లేఖలు రాయడం శోచనీయమన్నారు. కృష్ణానది మీద రాయలసీమలోని శ్రీశైలం రిజర్వాయర్ ఆధారంగా తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలుగొండ, కల్వకుర్తి, ఎస్ఆర్‌బీసీ, కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కావున బోర్డు కార్యాలయాన్ని శ్రీశైలం రిజర్వాయర్ సమీపంలోని రాయలసీమలో ఏర్పాటుచేయడం సమంజసం అన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గోదావరి నదిపై రాజమండ్రికి సమీపంలో జరుగుతోందన్నారు. కావున పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయాన్ని ప్రాజెక్టుకు సమీపంలో ఉండే రాజమండ్రిలో ఏర్పాటుచేయడం సమంజసం అన్నారు. అలాగే ప్రఖ్యాత నాటక రచయిత, నంది అవార్డుల గ్రహీత, మిత్రుడు పల్లేటి లక్ష్మి కులశేఖర్ అకస్మిక మృతి బాధాకరమని, నాటకరంగానికి ఇది తీరని లోటని పేర్కొన్నారు.

రేపటి నుంచి స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 11: విజయవాడలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీగా ఉన్న 206 మంది స్టాఫ్ నర్సుల నియామకానికి ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు కడప ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందని కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి అభ్యర్థుల ఎంపిక జాబితాను రూపొందించామని పేర్కొన్నారు. 15 వతేదీ మినహాయించి మిగిలిన నాలుగు రోజుల పాటు రోజుకు 50 మంది అభ్యర్థులకు పాత రిమ్స్‌లోని ఆర్డీకార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం www.hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని మెడికల్ ఆర్డీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయస్థాయి అవార్డుకు మదనపల్లె అంగన్‌వాడీ వర్కర్ ఎంపిక



అంగన్‌వాడి వర్కర్ జయలక్ష్మి

మదనపల్లె టౌన్, ఆగస్టు 11: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, తల్లులకు, గర్భిణులకు అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను మదనపల్లె పట్టణం ఇందిరానగర్-1 అంగన్‌వాడీ సెంటర్ కార్యకర్త జయలక్ష్మి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. 2019 సంవత్సరంలో మదనపల్లె పర్యటనకు వచ్చిన నీతి ఆయోగ్ బృందం జయలక్ష్మి సేవలను కొనియాడారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న వచ్చి ప్రథమ్ టీం సైతం ఈమె పనితీరును మెచ్చుకున్నారు. అలాగే ప్రీస్కూల్ చిన్నారులను 100శాతం చేర్పడంతో పాటు, మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌గా తీర్చిదిద్దడంలో జయలక్ష్మి విశేషంగా కృషి చేశారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 15వ తేదీన న్యూఢిల్లీలోని ఎర్రకోటలో ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా జయలక్ష్మి జాతీయస్థాయి అవార్డు అందుకోనున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి సీడీపీవో సుజాత అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పురస్కారానికి ఐదుగురు మాత్రమే ఎంపికయ్యారు. వీరిలో జయలక్ష్మి ఒకరు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం

- టీడీపీ పాలనలోనే మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం
- జగన్ హజ్‌హౌస్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: టీడీపీ పాలనలోనే మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం జరిగాయని.. తాము వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరులోని ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలులో అంజుమన్ అహలే ఇస్లామి కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టజీవులైన మైనారిటీల ఆర్థిక పరిపుష్టికోసం అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మైనారిటీ కార్పొరేషన్, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, మైనారిటీ వసతి గృహాలు ఏర్పాటు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలోనే షాదీఖానాలు ప్రారంభం అయ్యాయన్నారు. గతంలో చంద్రబాబు చేపట్టిన సంస్కరణల వల్లే రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. వక్ఫ్‌బోర్డు దేశంలోనే పెద్ద ఆస్తులు ఉన్న మూడవ సంస్థ అని దాని ఆస్తుల పరిరక్షణకు కృషిచేస్తామని అన్నారు. వక్ఫ్‌బోర్డుకు 40 సవరణలతో పార్లమెంటులో బిల్లు పెడితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ బిల్లును జేపీసీకి అప్పగించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారని అన్నారు. తాము కడపలో హజ్‌హౌస్‌ను నిర్మిస్తే గత ముఖ్యమంత్రి జగన్, ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా దానిని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో పెట్టిన సీఏఏ, త్రిబుల్ తలాక్ బిల్లులకు జగన్ సంపూర్ణ మద్దతు తెలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం కడప జిల్లాలో మైనారిటీల కోసం రూ.60 కోట్లు కేటాయిస్తే జగన్, అంజాద్‌బాషా ఆ నిధులను ఉపసంహరించుకున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ రోగులకు డబ్బులు కేటాయిస్తే ఆ డబ్బులను కూడా వెనక్కు తీసుకున్న మానత్వం లేని మనిషి జగన్ అని విమర్శించారు. జగన్ చేసిన రూ.12 లక్షల కోట్ల అప్పును ఎవరు తీర్చాలని ప్రశ్నించారు. దుల్హన్ కింద పెళ్లి చేసుకున్న కొత్త జంటలకు చంద్రబాబు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేస్తే జగన్ లక్ష ఇస్తామని మోసం చేశారని విమర్శించారు. అర్హత లేకపోయినా జగన్ ప్రతిపక్ష హోదాకోసం వెయ్యి మందితో సెక్యూరిటీ కల్పించాలని గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నారన్నారు. ప్రొద్దుటూరులో వక్ఫ్ స్థలం ఉంటే కాంప్లెక్స్ నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని జగన్ వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. గత ముఖ్యమంత్రి నియంత పాలన సాగిస్తే చంద్రబాబునాయుడు ప్రజలకోసం రోజుకు 18 గంటలు శ్రమిస్తున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు, మసీదు ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని దీనిని సహించమని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు సీఎం సురేశ్‌నాయుడు, వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మైనారిటీలకు అన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాకు చెందిన మైనార్టీ వ్యక్తి ఉపముఖ్యమంత్రిగా ఉన్నా మైనార్టీలకు ఒరిగిందేమీ లేదన్నారు. అనంతరం వక్ఫ్ఆస్తులు కాపాడాలని ఇన్సాఫ్ నాయకులు, కూరగాయల వ్యాపారులు, న్యాయవాదులు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షుడు బొల్లవరం బాషా, కార్యదర్శి ఇలియాస్ ఖురేషి, వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా అధ్యక్షుడు బేపారీ జాకీర్ అహమ్మద్, ఆయూబ్‌ఖాన్, ప్రభుత్వ చీఫ్ క్వాజీ ఇనాయతుల్లా, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ప్రసాద్, ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చిత్రంలో ఎమ్మెల్యేవరదరాజులరెడ్డి తదితరులు

ఫైల్స్ కేసులో.. బిగుసుకుంటున్న ఉచ్చు

- ఓ వైపు సీఐడీ విచారణ.. మరోవైపు 22ఏ ఫైళ్లు క్షేత్రస్థాయిలో పరిశీలన
- హడలిపోతున్న అక్రమార్కులు



మంటల్లో మదనపల్లె సబ్ కలెక్టరేట్ (ఫైల్)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసులో అక్రమార్కులకు ఉచ్చు బిగుసుకుంటోంది. సంఘటన జరిగి ఇప్పటికి సుమారు 20 రోజులు గడుస్తోంది.. ఈ సంఘటనపై అటు జిల్లా పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. ఇరువురు ఆర్డీవోలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఫైళ్ల దగ్ధం వెనుక ఉన్న పలువురి సూత్రధారుల ఇళ్లపై దాడులు చేసి కీలకమైన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కేసు తీవ్రతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఫైళ్ల దగ్ధం వెనుక ఉన్న కుట్రను ఛేదించేందుకు సీఐడీకి అప్పగించింది. మరోవైపు గత మూడు, నాలుగేళ్లుగా జరిగిన 22ఏ ఫైళ్లు, డీకేటీ భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారంలో ఏవైనా గోల్‌మాల్ జరిగాయా? అందుకే ఫైళ్లు కాల్చారా అనే అనుమానంతో.. స్వయంగా సబ్‌కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రతి ఫైల్‌కు సంబంధించిన భూములను పరిశీలిస్తున్నారు. వీటివల్ల జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వ్యూహాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ చర్యల వల్ల తమకు ఉచ్చు బిగుసుకుంటోందని అక్రమాల పాత్రధారులు, సూత్రధారులు హడలిపోతున్నారు.

పలువురిపై కేసులు

గత నెల 21న రాత్రి 11.25 గంటల సమయంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను కొందరు కాల్చేశారు. తొలుత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందేమోనని అనుకున్నప్పటికీ.. తర్వాత అది ప్రమాదం కాదు.. ఉద్దేశ్యపూర్వకంగా చేసిందేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించడంతో పాటు.. ఈ ఫైళ్ల దగ్ధం వెనుక.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, బినామీల హస్తం ఉందనే ఆరోపణలు రావడంతో.. సాక్షాత్తూ.. రాష్ట్ర పోలీసు బాస్ మదనపల్లెకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. ఈ ఫైళ్లు కాల్చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఫైళ్ల దగ్ధం వెనుక.. ఉన్న అసలు కారణాలను ప్రాథమికంగా గుర్తించారు. అదే సమయంలో సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యర్ కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా, పలువురు రాష్ట్ర స్థాయి అధికారులు సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించి.. ఇది ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రమాదం కాదు.. ఉద్దేశ్యపూర్వకంగానే ఆయిల్ పోసి మంట పెట్టారనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా పోలీసులు గతంలో మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్, గౌతమ్ తేజ్‌లను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారించారు. ఈ సందర్భంగా వాళ్లు ఇచ్చిన సమాచారంతో.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించి కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇతనితో పాటు మాజీ పోస్టల్ ఉద్యోగి కృష్ణారెడ్డి ఇంట్లో, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష, పెద్దిరెడ్డి పీఏ శశికాంత్ తదితరుల ఇళ్లలో సోదాలు నిర్వహించి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలన్నిం టి నేపథ్యంలో.. మదనపల్లె ఫైల్స్ వెనుక పెద్దిరెడ్డి కుటుంబం పాత్ర ఉందనే అనుమానాలను కూటమి వ్యక్తం చేస్తోంది.

రంగంలోకి సీఐడీ

సంఘటన జరిగిన రోజు నుంచి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు విచారణ చేస్తున్నారు. సుమారు 10 బృందాలు ఈ కేసులో అనుమానితుల కోసం వెతుకుతున్నాయి. అప్పటికి కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించకపోయినప్పటికీ.. సీఐడీ పోలీసులు జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకుంటూ.. కేసును దర్యాప్తు చేస్తూ వచ్చారు. అదుపులో ఉన్న అనుమానితులతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయడంతో పాటు.. అనుమానితుల ఫోన్‌కాల్స్ పరిశీలించారు. ఈ ఫోన్‌కాల్స్ విచారణతో మరికొందరి ఇళ్లు, ఆఫీసులపై సోదాలు చేశారు. వందలాది డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ డాక్యుమెంట్ల పరిశీలన తర్వాత... మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష, మాధవరెడ్డితో పాటు శశికాంత్, జింకా చలపతి తదితరులపైన కేసులు నమోదు చేశారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారించి.. వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం కేసును సీఐడీకి అప్పగించింది. దీంతో కేసు విచారణ వేగం పెరిగిందనే చెప్పవచ్చు. పోలీసులకు దొరకకుండా.. పరారీలో ఉన్న మాధవరెడ్డి, శశికాంత్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకునేందుకు సీఐడీ పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న వారి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

22ఏ, ఫ్రీహోల్డ్ పై క్షేత్రస్థాయిలో పరిశీలన


మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధం కావడానికి ప్రధానంగా 22ఏ ఫైళ్లు, డీకేటీ ఫైళ్ల ఫ్రీహోల్డ్ వ్యవహారమే ప్రధాన కారణమని దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి. దర్యాప్తు సంస్థల నివేదికతో గత మూడు, నాలుగు సంవత్సరాల్లో జిల్లాలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములు, ఫ్రీహోల్డ్ భూముల వివరాలను బయటకు తీయాలని నిర్ణయిం చింది. ఈ నేపథ్యంలో స్వయంగా మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో గతంలో జరిగిన 22ఏ, ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలించారు. ఈ చర్యలతో తాము చేసిన అక్రమాలు బయటపడతాయేమోనని అక్రమార్కులు హడలిపోతున్నారు. ఈ సంఘటనలో ఎటువంటి తొందర పాటు చర్యలు లేకుండా.. కారకులను పట్టుకునేందుకు ప్రభుత్వం అష్టదిగ్బంధనం చేస్తోందని పేర్కొంటున్నారు.

అందరి వేళ్లూ.. పెద్దిరెడ్డి వైపే..

ఈ సంఘటన జరిగినప్పటి నుంచి అందరి వేళ్లూ.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, అతని అనుచరుల వైపే చూపిస్తున్నాయి. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం, వాళ్ల అనుచరులు అనేక భూ ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వందలాది ఎకరాలు ఆక్రమించేశారని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్దిరెడ్డి అనుచరుల పేరుతో పలువురు తమ భూములను ఆక్రమించారని, నామమాత్రపు డబ్బు ఇచ్చి బెదిరించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, తమ భూములకు సంబంధించిన రికార్డులు రెవెన్యూ కార్యాలయాల్లో లేకుండా చేశారని పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. సిసోడియాకు బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి.. మరికొందరిని విచారించాలని చూస్తున్నారు. పెద్దిరెడ్డి ముఖ్యఅనుచరులు మాధవరెడ్డి, జింకా చలపతి, శశికాంత్ బుల్లెట్ సురేష్, అస్లాంతో పాటు మరికొందరు పలు అక్రమాలకు పాల్పడడంతో పాటు.. 22ఏ ఫైళ్ల క్లియరెన్స్‌లో అక్రమాలకు పాల్పడ్డారని అనుమానిస్తున్నారు.

పేరుకుపోయిన ఎరువుల బకాయిలు

- చెల్లింపుల్లో ఆర్ఎస్‌కే సిబ్బంది నిర్లక్ష్యం
- అధికారులు అడుగుతున్నా స్పందించని వైనం



కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 11: జిల్లాలో ఎరువుల బకాయిలు పేరుకుపోతున్నాయి. వీటి వసూళ్లు అధికారులకు తలకు మించిన భారంగా మారుతోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలకు మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు సరఫరా చేశారు. రైతులకు విక్రయించిన ఎరువులకు సంబంధించిన డబ్బులు రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఉంటుంది. ఎరువుల స్టాకు పరిశీలించడంతో పాటు అమ్ముడుపోయిన ఎరువులకు సంబంధించిన డబ్బులను సకాలంలో మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సిన బాధ్యత స్థానిక వ్యవసాయ అధికారులపై ఉంటుంది. కానీ ఈపని సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బకాయిలు పేరుకుపోయాయని అంటున్నారు.

రూ.21.74 లక్షల బకాయిలు

జిల్లాలోని 129 రైతు భరోసా కేంద్రాలు రూ.21,74,760 బకాయిలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాలకు ఎరువులను సరఫరా చేసేందుకు వ్యవసాయ డివిజన్ల పరిధిలో ఒక హబ్‌లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతుభరోసా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేస్తారు. ఇందులో భాగంగా జమ్మలమడుగు హబ్ నుంచి రూ.6,45,906 రావాల్సి ఉండగా అత్యధికంగా ఒక్క దిగువ కలవటాల కేంద్రం నుంచే రూ.4,42,000లు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. కడప హబ్ నుంచి రూ.2,55,681 రావాల్సి ఉంటే ఖాజీపేట మండలంలోని పుల్లూరు ఆర్బీకే నుంచి రూ.1,47,321లు వసూలు కావాల్సి ఉంది. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని హబ్ నుంచి రూ.19,948 బకాయి ఉంది. ఇక ముద్దనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో రూ.2,81,861 బకాయిలు ఉన్నాయి. ఈ హబ్ పరిధిలోని సింహాద్రిపురం మండలం కసనూరుకు చెందిన కేంద్రం నుంచి రూ.1,25,516లు బకాయి ఉన్నట్లు సమాచారం. పోరుమామిళ్ల హబ్ పరిధిలో రూ.4,81,398లు రావాల్సి ఉండగా బి.కోడూరు మండలంలోని మేకవారిపల్లె కేంద్రం నుంచి రూ.1,05,877లు అత్యధికంగా బకాయి ఉన్నట్లు సమాచారం. పులివెందుల హబ్ పరిధిలో రూ.3,91,179లు రావాల్సి ఉండగా చక్రాయపేట మండలం కుమారకాల్వ నుంచి రూ.2,66,593లు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. బద్వేలు హబ్ పరిధిలో రూ.30,844, మైదుకూరు హబ్ పరిధిలో రూ.67,946లు బకాయి ఉన్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల దృష్టికి బకాయిల అంశం..

బకాయిలు ఉన్నది వాస్తవమే. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఈ సీజన్ నుంచి సొసైటీల ద్వారా ఎరువులు విక్రయించాలని ఆదేశాలు ఉన్నాయి. సొసైటీ వారందరికీ శిక్షణ ఇవ్వడంతో పాటు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. బహుశా వచ్చే సీజన్ నుంచి రైతులకు సొసైటీల ద్వారా ఎరువులు అందే అవకాశాలు ఉండొచ్చు.

- పరిమళజ్యోతి, జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్

సహకార సొసైటీల ద్వారా ఎరువులు

కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు ఎరువులు అందించేందుకు సహకార సొసైటీలను వినియోగించుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తుంది. కానీ ఇందుకు సొసైటీ సిబ్బంది వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. పాలకవర్గం చెప్పినట్లు వినాల్సి ఉండడంతో వారు చెప్పినట్లు అప్పులు ఇస్తే తిరిగి వసూళ్లు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయంలో సిబ్బంది ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఏదిఏమైనా ఈ సీజన్ కాకున్నా వచ్చే సీజన్ నుంచి సొసైటీల ద్వారా ఎరువులు రైతులకందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా మామిడిలో ఐదేళ్లుగా నష్టాలే. రైతులపై ప్రకృతి విపత్తుల ప్రభావం తీవ్రంగా ఉంది. రెండేళ్లు కరోనా కష్టకాలంలో దిగుబడి వచ్చినా ఎగుమతులు లేక నష్టపోయారు. మరో ఏడాది అకాల వర్షాలు గాలి వానలతో తోటలో దెబ్బతిని నష్టాలు చవిచూశారు. గత ఏడాది పచ్చ పురుగులు, తెగుళ్లు అధికమై వర్షాభావ పరిస్థితుల్లో పూత రాక దిగుబడి 30 శాతానికి పడిపోయింది. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా ఈ ఏడాదీ దిగుబడి చాలా తగ్గింది. ఇలా ఐదేళ్లుగా మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు.



మామిడి తోటల్లో పిచికారి చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

ఐదేళ్లుగా నష్టాలే..

- రెండేళ్లు కరోనా
- మరో ఏడాది అకాల వర్షాలు, గాలి, వానలు
- గత ఏడాది పురుగులు, తెగుళ్లు
- మామిడి రైతులను ఆదుకునేది ఎవరు



బంక తెగులు రావడంతో తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు (ఫైల్‌ఫోటో)

రాయచోటి (సంబేపల్లె), ఆగస్టు 11: జిల్లా వ్యాప్తంగా 31 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో సుమారు 40వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. నవంబర్, డిసెంబరు నెలల్లో మామిడి తోటలు పూత వస్తాయి. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో కూడా తోటలు పూత రాలేదు. వచ్చిన పూతకు తెగుళ్లు సోకడంతో మందులు కొట్టినా తగ్గలేదు. పిందె కూడా పట్ట లేదు. సస్యరక్షణ ఖర్చులు పెరిగాయే తప్ప రైతులకు మాత్రం దిగుబడులు రాలేదు. బూడిద తెగులు, బంక తెగులు, మసి తెగులు, తేనెమంచి పురుగు ఇలా ఎక్కడ చూసినా రైతుల పాలిట శాపంగా మారాయి. జల్లుపూతలతో పిందె పట్టక దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. గత ఏడాది మామిడి తోపులు కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా అడ్వాన్సులు వదిలేసి తోటల వైపు కన్నెత్తి చూడలేదు.

రైతులకు సస్యరక్షణ ఖర్చులు పెరిగాయి

మామిడి రైతులకు సస్యరక్షణ ఖర్చులు పెరిగాయి. నవంబర్, డిసెంబరు నుంచి తెగుళ్ల నివారణ కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పూతరాక మునుపు ఒకసారి పూత వచ్చిన తర్వాత, పిందె దశలో మరోసారి పిచికారి చేసేవారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా పొగమంచుతో మామిడిలో తెగుళ్ల వస్తున్నాయి. దీంతో కొంత మంది రైతులు నాలుగు నుంచి ఐదు సార్లు మందులు పిచికారి చేశారు. ఒక నీటి ట్యాంకర్‌కు రూ.4 వేలు ఖర్చు చేస్తున్నారు. మూడు, నాలుగు సార్లు పిచికారి చేయడంతో రైతులకు అదనపు ఖర్చులు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా మామిడి చెట్లలో కొంతకాలంగా జూలై, ఆగస్టులోనూ పూత వస్తోంది. వీటిని కాపాడుకుని కాస్త సైజు రాగానే ఊరగాయలకోసం అమ్మేస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా మామిడిచెట్లలో ఉన్న పూతను కాపాడుకునేందుకు రైతులు అగసాట్లు పడుతున్నారు. ఇది ఎంత ఎక్కువ దిగుబడి వచ్చినా కంటితుడుపు చర్యలా ఉంటుంది తప్ప పెద్ద ఆదాయం ఉండదు. మామిడి తోటలు విస్తారంగా సాగులో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూత సక్రమంగా రాలేదు..



నాకు మూడున్నర ఎకరాల మామిడి తోపు ఉంది. గత ఏడాది పూత సక్రమంగా రాలేదు. పూత వచ్చినా బంక తెగులుతో పిందపట్టలేదు. తెగుళ్లతో నష్టపోక తప్పడం లేదు. ఫిబ్రవరి, మార్చిలో కూడా పూత వస్తా ఉంది. ఈ పూత నిలబడదు. మామడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- నాగభూషణం, మామిడి రైతు, మాధవాండ్లపల్లి, సంబేపల్లె మండలం

ఐదేళ్లుగా నష్టపోతూనే ఉన్నాం..



ఐదేళ్లుగా నష్టపోతూనే ఉన్నాం. రెండేళ్ల కరోనాతో నష్టపోయాం. తర్వాత అకాల వర్షాలు, గాలి, వానలతో కాయలపై బంక తెగులు వచ్చి నష్టపోయాం. రూ.35 లక్షలకు మామిడితోటలు కొన్నా. కొన్ని తోటల్లో పూత రాలేదు. కొన్న తర్వాత కొట్టిన మందుల డబ్బులు కూడా చేతికి రాలేదు.

- ఖాదర్‌వల్లి, మామిడి వ్యాపారి, సంబేపల్లె మండలం

ఘనంగా 'అలంకార చిత్రం' పుస్తకావిష్కరణ



అలంకార చిత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: అలంకారం వెంకటరమణరాజు రచించిన అలంకార చిత్రం గ్రంథాన్ని చిత్రసాహితీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జార్జ్‌కారోనేషన్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కవులు చిత్రవిచిత్రమైన విన్యాసాలతో అలంకారాలను ప్రయోగించారన్నారు. అటువంటి చమత్కార విన్యాసాలతో కూడిన పద్యాలను, వివిధ బాషల్లోని అలంకార చిత్రాలను క్రోడీకరించి అలంకార చిత్రం పేరుతో రచయిత భావితరాలకు పుస్తకాన్ని అందించారని ఆయన కృషి అమూల్యమైనదన్నారు. పుస్తక సమీక్షకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ వేల సంఖ్యలో పద్యాలను పరిశోధించి సేకరించి ఈ పుస్తకాన్ని రచించారని తెలిపారు. రచయిత డీకే చదువులబాబు మాట్లాడుతూ రచయిత పరిశోధన విలువైనదని పేర్కొన్నారు. రచయిత కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ వివిధ బాషల్లోని అలంకారాన్ని సేకరించి పుస్తకాన్ని వెలువరించడం అభినందనీయమన్నారు. రచయిత అలంకారం వెంకటరమణరాజు, ఇందిర దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు దాదాహయత్, సాయిప్రసాద్, విజయ్‌కుమార్, ఆదిత్య కుమార్, వసంతకుమార్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు జిల్లా రచయితల నివాళి

కడప (నాగరాజుపేట), ఆగస్టు 11 : తెలుగునాటక రంగ చరిత్రలో మన జిల్లాకు అఖండమైన కీర్తిని ఆర్జించి పెట్టిన వారిలో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ మొట్టమొదటివారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం కడప రాజీవ్‌కల్చరల్ క్లబ్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో పల్లేటి లక్ష్మీకులశేకర్ సంస్మరణ సభ నిర్వహించారు. మొదట కులశేఖ ర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటకకర్తగా, నటునిగా, దర్శకునిగా, ప్రయోక్తగా పల్లేటి సాధించిన విజయాలకు ఆయనకు వందలాది సన్మానాలు జరిగాయనిఅన్నారు. రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైవీయూలో పల్లేటి రచనలు ఒక పరిశీలన అనే అంశంపై తాను పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నానన్నారు. పరిశోధనా సమయంలో కులశేఖర్ తనకు ఎన్నో అమూల్యమైన విషయాలు చెప్పేవారని అన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వ చారి మాట్లాడుతూ ఆయన రాసిన మొదటి సాంఘిక నాటకం తపస్సు సినిమాగా వచ్చిందన్నారు.

ఆర్కిటెక్చర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో నేషనల్ ఆర్కిటెక్చర్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ విషయాన్ని సంబంధిత కన్వీనరు డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ వైస్‌చాన్సలర్ ఆదివారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ లేదా డిప్లమా పూర్తి చేసి నాసా అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 19లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, ఫీజుల చెల్లింపు ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉంటుందన్నారు. విశాఖలోని డిపార్ట్‌మెంటు ఆఫ్ ఆర్కిటెక్చర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 44 సీట్లు, గుంటూరు ఏఎన్ఏయూ కాలేజీ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో 44 సీట్లు, భీమవరం ఎంఆర్‌కే కాలేజీలో 15 సీట్లు, తిరుపతి చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో 28 సీట్లు, కడప డాక్టర్ వైఎస్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో 44 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ, డీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్ తెలిపారు. హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ, డీఈడీ కోర్సులు నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అప్రూవల్‌తో నడుస్తోందన్నారు. ఇది వైవీయూ అఫిలియేషన్ పొందిందని, ఈ కోర్సులో చేరదలిచిన వారు బ్యాచ్‌లర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీలో సైన్స్, సోషల్ స్టడీస్ హ్యూమనీటిస్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఇంజనీరింగ్, లేక టెక్నాలజీలో సైన్స్ మేథమేటిక్స్‌లో స్పెషలైజేషన్ కలిగి 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. లేదంటే దీనికి సమానమైన ఏదైనా విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు11: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం సహా అన్ని డివిజన్లు, మండల ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రావాల్సిందిగా ఒక ప్రకటనలో తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఎర్రగుంట్ల, ఆగస్టు 11: ఎర్రగుంట్ల కడపరోడ్డులోని పొలాల్లో దేవరింటి ఎరికలమ్మ(53) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎల్లనూరు మండలం తిమ్మంపల్లెకు చెందిన ఈమె పులివెందుల నుంచి ప్రొద్దుటూరుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. సెల్‌ఫోన్‌ను బస్‌లో వదిలేసి ఎర్రగుంట్లలో దిగింది. ఆమె కుమారుడు ఇంద్రసేనారెడ్డి మధ్యాహ్నం2 గంటలకు ఫోన్‌చేస్తే బస్సు డ్రైవర్ మాట్లాడారు. ఆమె ఎక్కడ దిగింది తమకు తెలియదని చెప్పారు. దీంతో వారు ఎరికలమ్మ అదృశ్యంపై పులివెందుల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎర్రగుంట్లలో పొలాల్లో మృతదేహం ఉన్నట్లుగా ఎర్రగుంట్ల పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఎర్రగుంట్లకు వచ్చి మృతదేహాన్ని చేసి గుర్తు పట్టారు. కుమారుడు ఇంద్రసేనారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని, పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ఉరివేసుకుని మహిళ మృతి చెందడంతో విచారణ చేపట్టిన పోలీసులు

సిద్దవటం, ఆగస్టు 11: పాలకొండ్రాయునిపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం ఎద్దలకొండు వెంకటసుబ్బమ్మ(42) ఫ్యానుకు చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలు బంధువులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటసుబ్బమ్మ, ఆమె భర్త వెంకటరమణ ఇద్దరూ సొంత పొలంలో పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆమెకు అప్పుడప్పుడూ కడుపునొప్పి వస్తుండేదని ఆదివారం విపరీతంగా కడుపునొప్పి రావడంతో నొప్పిని భరించలేక ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. భర్త వెంకటరమణ పొలం పనులు ముగించుకుని ఉదయం 10 గంటలకు వచ్చి చూడగా భార్య వెంకటసుబ్బమ్మ ఫ్యానుకు వేలాడుతూ కనిపించిందని, విషయాన్ని బంధువులకు తెలియజేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలు వెంకటసుబ్బమ్మ తండ్రి చిన్నవెంటకసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

నేతన్నకు చేయూతనివ్వండి

ఎమ్మెల్యే మాధవీరెడ్డి
జేసీ అదితిసింగ్



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జేసీ

కడప (కల్చరల్), ఆగస్టు 11 : చేనేత వస్త్రాలను ధరించి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, కడప శాసనసభ్యురాలు మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నగర పరిధిలోని శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కళాకారులను ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలను ధరించి చేనేత పరిశ్రమ వృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేతల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలను ధరించి వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తాను చేనేత వస్త్రాలనే ధరిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేతలకు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేశ్‌చంద్ర, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజరావు, రాష్ట్ర పొలిట్ బ్యూరో శ్రీనివాసులరెడ్డి, చేనేత జాతీయ ఐక్యవేదిక కన్వీనరు అవ్వారు మల్లికార్జున, నాయకులు జేవీ రమణ, సంగటి మనోహర్, చేనేత జౌళిశాఖ అధికారులు, శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి : సీపీఐ

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 11: నియోజకవర్గంలో భూ కబ్జాదారుల నుంచి పేదల భూములను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఖద్దర్ బాబులు పేదల భూములను కబ్జాలు చేసి దందాలు నిర్వహించి లక్షల దోచుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులను చేతుల్లో పెట్టుకుని వాగులు, వంకలు, గట్టలు, ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ భూములు కబ్జాలు చేశారని ఆరోపించారు. ఇప్పుడైనా రెవెన్యూ అధికారులు స్పందించి పేదల భూములను భూ బకాసురులు నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి గంగాపూర్ తేజ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చెన్నూరు జాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొండకల్వటాలలో ఘర్షణ.. నలుగురికి గాయాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జమ్మలమడుగు, ఆగస్టు 11: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం కొండకల్వటాల గ్రామంలో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో గ్రామంలోని ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి రాత్రి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి చెప్పిన వివరాల మేరకు గ్రామంలో టీడీపీ నేత చక్రపాణిరెడ్డి, వైసీపీ నేత తలారి మహేష్ వర్గీయులు ఘర్షణపడ్డారు. ముందురోజు అహోబిలంలో ఫంక్షన్‌కు వెళ్లి అక్కడ గొడవకు దిగినట్లు గ్రామంలో వచ్చి ఆదివారం ఒకచోట కొందరు కూర్చొని మాట్లాడుకుంటుండగా తలారీ మహేష్ వర్గీయులు గొడవకు దిగారు. ఈ ఘటనలో ఇరువర్గీయులలో వాకు చిన్నబాలసుబ్బ, వాకు మధు, చిన్నమ్మ, జి.సురేష్‌కు గాయాలయ్యాయి. ఇరువర్గీయుల పై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

ఆటో, ఐషర్ ఢీ.. ఒకరి మృతి



మృతి చెందిన గంగులయ్య

చిన్నమండెం, ఆగస్టు11: బాబూజీనగర్ కాలనీ వద్ద కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ఆటోను ఐషర్ ఢీకొనడంతో గంగులయ్య(55) మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లె మండలం రెడ్డివారిపల్లె హరిజనవాడ వాసులు పడమటికోన హరిజనవాడలో వివాహం కోసం ఆటోలో వెళ్లి వస్తున్నారు. కాగా చిన్నమండెం నుంచి రాయచోటి వైపు వస్తున్న ఆటోను ఐషర్ ఢీకొంది. ఆటోలో దాదాపు 7, 8 మంది ప్రయాణిస్తుండగా వారిలో గంగులయ్య మృతి చెందగా మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారందరినీ రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సింది.

బంగారు నగల చోరీ

కడప (క్రైం), ఆగస్టు 11: కడప నగరం రాజారెడ్డి వీధిలో బంగారు నగలు చోరీ జరిగినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం జయన్న అనే వ్యక్తి కరెంటు బిల్లు చెల్లించేందుకు ఇంటికి తాళాలు వేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా తన ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి గమనించాడు. ఇంట్లోని 46 గ్రాముల బంగారు నగలు చోరీకి గురయ్యాయని తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజ్‌కుమార్ ఇంట్లో దొంగలు పడి ఓ నల్లపూసల దండను చోరీ చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇండ్లూరు వాసి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాచూరి నరసింహారావు

పెనగలూరు, ఆగస్టు 10: నెల్లూరు జిల్లా రాపూరు మండల పరిధి రాపూరు- పెంచలకోన హైవేపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండ్లూరు హరిజనవాడ వాసి రాచూరి నరసింహారావు(34) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాల్లోకెళితే... నరసింహారావు అతని భార్య జీవనోపాధి కోసం ఏడాది కిందట కువైట్ వెళ్లారు. నరసింహారావు మూడు రోజుల కిందట సొంతూరుకు వచ్చారు. మూడు రోజులు బంధువులతో గడిపిన తర్వాత నెల్లూరు జిల్లా కలువాయి మండలం కొల్లూరులో తన అత్త, మామ ఇంట్లో ఉన్న కుమార్తెను చూసేందుకు మూడేళ్ల కుమారుడిని వెంటబెట్టుకుని కొల్లూరు వెళుతుండగా రాపూరు దాటుకున్న తర్వాత హైవేపై ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. దీంతో నరసింహారావు తలకు తీవ్రగాయాలయ్యాయి. ఛాతి లోపల కూడా కనిపించని గాయాలు కావడం వల్ల ఆయన అక్కడే కుప్పకూలిపోయాడు. తనవెంట ఉన్న మూడేళ్ల చిన్నకుమారుడు చెయ్యి విరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. కుప్పకూలిన నరసింహారావును స్థానికులు రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా నరసింహారావు సంబంధీకులు ఎవరూ లేరని రాపూరు వైద్యులు దాదాపు రెండు గంటల వరకు చికిత్స అందివ్వక పోవడంతో మృతిచెందినట్లు సమాచారం. ఆయన మొబైల్‌లోని సమాచారంతో స్థానికులు, బంధువులకు ఫోన్లద్వారా తెలపడంతో ఇండ్లూరు నుంచి నరసింహారావు బంధువులు రాపూరు ప్రభుత్వాస్పత్రి చేరుకున్నారు. సంఘటనతో అటు కొల్లూరులో ఇటు ఇండ్లూరు హరిజనవాడలోను విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిగిన తర్వాత ఇండ్లూరులోని ఇంటికి తీసుకువచ్చి దహన క్రియలు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రూ.10 కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జి: ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మాధవీరెడ్డి, చైతన్యరెడ్డి, చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

సీకేదిన్నె, ఆగస్టు 11: రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు కమలాపురం, కడప ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, రెడప్పగారి మాధవీరెడ్డి ఆదివారం రూ.10 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఎర్రముక్కపల్లె, భాకరాపేట వద్ద కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ వద్ద పది మీటర్ల వెడల్పుతో రాను, పోను వేరువేరుగా నిర్మాణాలు చేపట్టేందుకు శంకుస్థాపన చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. బ్రిడ్జి ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయన్నారు. అలాగే ఇక్కడి ప్రజల చిరకాల కోరిక తీరుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నాయకులు డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, టక్కోలి క్రిష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, నాయకులు, పాల్గొన్నారు.

విశాఖపట్నం స్కిల్ డెవలప్‌మెంటు సెంటరును సందర్శించిన ఏఎఫ్‌ఏయూ వీసీ


వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్‌ను మెమెంటోతో సత్కరిస్తున్న స్కిల్ డెవలప్‌మెంటు ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ శనివారం విశాఖ పట్టణం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ సహకారంతో వైజాగ్ స్కిల్ డెవలప్‌మెంటు సెంటరు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కడపలో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఈఓ ఇంతియాజ్ అర్షద్, చీఫ్ మేనేజరు ఇంద్రజిత్ ముఖర్జీ, సీనియర్ మేనేజరు టీవీఎస్ మూర్తి, అసిస్టెంటు మేనేజరు ఎం.హరిప్రియ, నైపుణ్యాభివృద్ధి సంస్థ ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉర్దూ సమస్యల పరిష్కారానికి కృషి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉర్దూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని రూటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇమాంబాషా, సయ్యద్ ఇక్బాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూటా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఉర్దూ జిల్లా సదస్సులు అక్టోబరు నెలలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సమస్యలతో ఉర్దూ విద్యార్థులు ఉపాధ్యాయులు అధ్యాపకులు సతమతమవుతున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'వర్క్అడ్జెస్ట్‌మెంటును వెంటనే నిలిపేయాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 :సమావేశానికి ఆహ్వానం లేనందున తమ సంఘం ఏపీటీఎఫ్ అమరావతి హాజరు కాలేదని, తక్షణం వర్క్‌ఎడ్జస్ట్‌మెంటును నిలిపేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకనలో డిమాండ్ చేశారు. వర్క్ అడ్జెస్ట్ మెంటు కంటే ముందు పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం మూడు తరగతులు అయినా నడపాలని కోరారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

● కడప నగరంలో బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు


అమర్‌నాథరెడ్డి, ఎస్ఐ, కడప వన్‌టౌన్


రాజరాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ, కడప చిన్నచౌకు


జయరాములు, ఎస్ఐ, కడప రిమ్స్ పీఎస్

కడప (క్రైం), ఆగస్టు 11 :శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, రాజరాజేశ్వర్‌రెడ్డి, జయరాములు ఆదివారం బాధ్యతల స్వీకరించారు. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఎస్ఐల బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో ఆ ముగ్గురు ఎస్ఐలు తమకు కేటాయించిన పోలీసుస్టేషన్లలో బాధ్యతలు చేపట్టారు. వీరు 2012 బ్యాచ్‌కు చెందిన వారు. కడప చిన్నచౌకు ఎస్ఐగా ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐగా జి.అమర్‌నాథరెడ్డి, రిమ్స్ పీఎస్ ఎస్ఐగా జయరాములు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినా చర్యలు తప్పవన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వల్లూరు ఎస్ఐ



వల్లూరు, ఆగస్టు 11 : వల్లూరు మండల సబ్ ఇన్స్‌పెక్టరుగా ఆదివారం సంజీవరాయుడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో టూటౌన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వల్లూరు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకందుబాటులో ఉంటానని, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టానికి అందరూ సమానమేనని అన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


స్వామివారికి పూజలు చేస్తున్న వేదపండితులు


సీతారాములకు పూజలు చేస్తున్న పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే

వల్లూరు, ఆగస్టు 11:వల్లూరు మండలం తప్పెట్ల గ్రామంలో నిర్వహిస్తున్న సీతారామలక్ష్మణ హనుమంత ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. స్వాముల వారి విగ్రహాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల ఆనందోత్సాహాల మధ్య వేద పండితులు ప్రతిష్ఠించారు. అనంతరం మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం చేపట్టారు. ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వినియోగం చేశారు. కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, యువ నాయకుడు లక్ష్మీరెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ వీరారెడ్డి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

క్షేత్ర పర్యటనకు వెళ్లిన వైవీయూ జంతు శాస్త్ర విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 :వైవీయూ జంతు శాస్త్రశాఖ విద్యార్థులు, ఆ శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ బి.అనుప్రసన్న, అధ్యాపకులు మరియదాస్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. నూతన విద్యావిధానం, నైపుణ్య ఆధారిత శిక్షణలో భాగంగా నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్ సమీపంలోని రెండు హెచరీలను పరిశీలించారు. ఆక్వాఫాంను సందర్శించి అక్కడ జలచర జీవులైన రొయ్యలు, చేపలు గుడ్డు దశ నుంచి పెరిగే విధానం గురించి తెలుసుకున్నారు. అలాగే వివిధ రకాల చేపల, రొయ్యల నమూనాలను సేకరించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ప్రతిష్ఠ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అమ్మవారి మూలవిరాట్‌కు అవభృతస్నానం చేయించి వజ్రపు చీరె, వజ్రపు కిరీటంతో అలంకరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన అన్న క్యాంటీన్

జమ్మలమడుగు, ఆగస్టు 11: జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన ఈనెల ఆగస్టు 15వ తేదీ అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగనున్నాయి. అందులో భాగంగా గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇదే ప్రదేశంలో అన్నా క్యాంటీన్ ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అయిన తర్వాత శరవేగంగా ఇచ్చిన మాట ప్రకారం అన్నా క్యాంటిన్లు తెరిచేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగులో అన్నా క్యాంటిన్ గత 15 రోజుల నుంచి పనులు ప్రారంభించి క్యాంటిన్ సిద్ధం చేశారు. పూర్తి పనులన్నీ సోమవారం నాటికి సిద్ధం చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ అన్న క్యాంటిన్ ప్రారంభించేందుకు వేగంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో సరస్వతి విద్యాపీఠం అనంతపురం కమిటీ స్థాయి ఖేల్‌కుద్ పోటీల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు.ఆదివారం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య పాల్గొన్నారు.

'జీఓ 117ను రద్దు చేయాలి'



మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : ఎన్‌డీఏ ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 117 జీఓను రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 117 జీఓ లోపబూయిష్టమన్నారు. కేవలం ఇంగ్లీషు మడియం మాత్రమే ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయులకు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

117 జీఓను రద్దుచేయాలి: పీడీఎస్‌యూ

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 11 : జీఓ 117ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలలను పదిమంది విద్యార్థుల లోపు ఉంటే మూసివేసే ప్రయత్నం ప్రస్తుతం జరుగుతుందని, ఇది విద్యారంగానికి పాఠశాలల మనుగడకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించండి

● వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి

కడప (క్రైం), ఆగస్టు 11 : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సూచించారు. కడప నగరం ఎర్రముక్కపల్లె సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఆర్‌సీ ఇన్సురెన్స్‌తో పాటు ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చని సూచించారు. వాహనపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

హజ్‌హౌస్‌ను మళ్లీ ప్రారంభించండి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 11 : హజ్‌హౌస్‌ను మళ్లీ ప్రారంభించాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు జేకే యూత్ ఫౌండర్ ఖాదర్‌బాషా విన్నవించారు. ఆదివారం రాష్ట్రమంత్రి ఫరూక్ ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆగష్టు 15న కడపకు రానున్న రాష్ట్ర మంత్రి తన చేతుల మీదుగా హజ్‌హౌస్‌ను పరిశీలించి త్వరలో ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి నారాయణను కలిసిన బలిజ సంఘం నేతలు


మంత్రి నారాయణను సన్మానిస్తున్న బండి బాబు తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 11 : పెంచలకోన బలిజ అన్నదాన సత్రం సమస్యలపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను బలిజ సంఘం నేతలు ఆదివారం కలిశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండి బాబు, టీడీపీ నేతలు చెన్నంశెట్టి మురళీక్రిష్ణ, బండారు సత్య, పెంచలకోన బలిజ అన్నదాన సత్రం చైర్మన్ మురళి, తిరుమలశెట్టి ఈశ్వరయ్య, బలిజ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి మస్తాన్ రాయలు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

చెన్నూరు, ఆగస్టు 11 : చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలోని కొండపేట బ్రిడ్జి వద్ద జూదం ఆడే నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,320 స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల్లో జూదం కూడా ఒకటని, ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. అలాగే ప్రజలు కూడా జూదం, అక్రమ ఇసుక రవాణా, బెట్టింగ్, గంజాయి అక్రమాలు లాంటివి తమ దృష్టికి వస్తే పోలీసులకు తెలపాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తారసపడినా తనకు తెలపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

దళితులపై అగ్రవర్ణాల దాడులు సహించబోం

● దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిశోర్


సమావేశంలో మాట్లాడుతున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిశోర్

కడప (నాగరాజుపేట), ఆగస్టు 11: దళితులపై అగ్రవర్ణాల దాడులు సహించబోం అని దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిశోర్ హెచ్చరించారు. ఆదివారం దళిత సంఘం కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణం సి.కొత్తపల్లెలో రెండు ఎకరాల ప్రభుత్వ డీకేటీ స్థలంలో నిరుపేద దళితుల అనుభవంలో ఉండగా వారిపై అగ్రవర్ణాల వారు ఈ భూమి తమదని దాడి చేయడం బాధా కర మన్నారు. శనివారం బద్వేలు పట్టణంలోని కొత్తపల్లె గ్రామాన్ని సందర్శించా మ న్నారు. దళితులను కులం పేరుతో దూషిస్తూ ఆ భూమి తమదంటూ రామచంద్రారెడ్డి, అతని వర్గీయులు దాడికి పాల్పడ్డారన్నారు. ఇలాంటి దుశ్చర్యలను ము న్ముందు సహించబోమన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళతామని, అయినప్పటికీ న్యాయం జరగకపోతే దళిత సంఘాలన్నింటినీ ఏకం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనరు నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో పేద దళితులు నివాసం ఏర్పచుకుని నివసిస్తుంటే అగ్రవర్ణాల వారు వచ్చి భయాందళనలు సృష్టించడం దారుణమన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్తార్ మాట్లాడుతూ దళితులపై దాడులు జరగడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. బడుగు, బలహీనవర్గాలు, అగ్రవర్ణాల వారు తరచూ దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. అటువంటి వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సగిలి గురప్ప మాట్లాడుతూ దాడులకు పాల్పడిన రామచంద్రారెడ్డి అతని వర్గీయులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే దళితులందరూ ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత ఫోరం నాయకుడు శ్రీరాములు, అఖిలక్ష కమిటీ సభ్యులు ఆర్వీ ప్రసాదరావు, కెమికల్స్ యూనియన్ లీడర్ చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సీపీఐ పోరుబాట

● పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కమలాపురం రూరల్, ఆగస్టు 11 : నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సీపీఐ పోరుబాట పట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. ఆదివారం కమలాపురంలో ఏర్పాటు చేసిన సీపీఐ కమలాపురం నియోజకవర్గ సమావేశానికి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గసభ్యులు గుంటి వేణుగోపాల్, ఎస్.విజయలక్ష్మి, కేసీబాదుల్లాలు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి సీపీఐ ఆధ్వర్యంలో దశల వారీ పోరాటానికి సమాయత్తమవుతున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కమలాపురం నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి పెండింగు ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. సర్వరాయసాగర్ ప్రాజెక్టులో జలకళ ఉట్టిపడుతున్నా ఆయకట్టు రైతాంగానికి గుక్కెడు నీరు కూడా ఇవ్వలేని స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. టీడీపీ ప్ర భుత్వం అయినా సర్వరాయసాగర్ ప్రాజెక్టు పంట కాల్వలను పూర్తి చేయాలన్నారు. పంట కాల్వల పూర్తి కోసం సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబరు మూడో వారంలో ఆయకట్టు రైతాంగంతో కలిసి కడప కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. అలాగే జీఎన్ఎస్ఎస్ కాల్వ పనులను పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతాంగానికి నీళ్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. త్వరలో సీపీఐ ప్రతినిధుల బృందం జీఎన్ఎస్ఎస్ పనులను పరిశీలించనుందని, అనంతరం ఆందోళన కార్యక్రమాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఏరియా కార్యవర్గసభ్యులు సుభాషిణి, వరప్రసాద్ పాల్గొన్నారు.

రెగ్యులర్ డీసీఓను నియమించాలి: ఏఐఎస్‌బీ

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 11 : అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు జిల్లా కో ఆర్డినేటరును నియమించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కాలంగా అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రెగ్యులర్ డీసీఓ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల్లో సమన్వయం లోపించి విధులు సరిగ్గా చేయకుండా సమస్యలకు నిలయంగా మారుస్తున్నారన్నారు. తక్షణం రెగ్యులర్ డీసీఓను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేదంటే ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో హేమచంద్రరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'సర్దుబాటు కన్నా ముందు పదోన్నతులు కల్పించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 11 : ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలోల్ల సర్దుబాటు చేయాలన్న ఆలోచన విరమించి మెథడాలజీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు 20 నుంచి 25 సంవత్సరాల పాటు ఒకే కేడరులో పనిచేస్తున్నా పదోన్నతి కల్పించే అవకాశం కనబడలేదన్నారు. ప్రస్తుత రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత పాఠశాల ల్లో 17కు పైగా సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నప్పుడు అందులో 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, తద్వారా ఖాళీగా ఏర్పడనున్న ఎస్‌జీటీ పోస్టుల విషయంలో విద్యవలంటీర్లను నియమించాలని కోరారు. పాఠశాలలకు మౌళిక వసతుల కల్పన కోసం పాఠశాలల నిర్వహణ ఖర్చుల నిమిత్తం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే మెయింటెనెన్స్ గ్రాంటు విడుదల చేయాలని కోరారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

● మాజీ డిప్యూటీ మేయరు ఆరిపుల్లా


అంబేడ్కర్ విగ్రహాన్ని చూపిస్తున్న ఆరిపుల్లా

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : మాజీ ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా తెలిపారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వం సం చేశారని దుష్ప్రచారం నేపథ్యంలో ఆయన అక్కడి విగ్రహాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ బ్యాచ్ పనిగట్టుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు విషప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసిందన్నారు. నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని, ఇటువంటి దుష్ప్రచారాలు మానుకోవాలని పేర్కొన్నారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

చెన్నూరు, ఆగస్టు 11 : మండలంలో పనిచేస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో రీఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం 1994, పారిశుధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహణ, స్ట్రీట్ లైట్ల మీద శిక్షణ కారక్రమం ఉంటుందని వివరించారు. కావున పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఈ కార్యక్రమానికి హాజరై విధులు బాధ్యతలు తెలుసుకుని పంచాయతీలను అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు.

నూతన వంగడాలపై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

సీకేదిన్నె, ఆగస్టు 11: రైతులు నూతన వంగడాలపై అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేం ద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం పోషక విలువలతో కూడిన 109 రకాల నూతన వంగడాలను విడుదల చేశామన్నారు. 34 క్షేత్ర పంటలు, 27 ఉద్యానపంటలు, 61 పంటల్లో 109 రకాలను వ్యవసాయ పరిశోధన సంస్థ ఢిల్లీలో విడుదల చేశార న్నారు. సామాజిక శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ రైతులు ప్రజలు వాడే అన్ని రకాల ఆహార పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా ప్రజలకు మంచి ఆహారం లభించడంతోపాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీదేవి ప్రతిష్ఠ మహోత్సవం



వజ్రపుచీరె, వజ్రపు కిరీటం అలంకరణలో అమ్మవారు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అమ్మవారి మూలవిరాట్‌కు అవభృతస్నానం చేయించి వజ్రపు చీరె, వజ్రపు కిరీటంతో అలంకరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని అంబేడ్కర్‌గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మనాభమూర్తి తెలిపారు. 5, 9వతరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలి పారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపు చదవాలనుకున్న విద్యార్థులు కళాశాలకు వచ్చి తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వర్షం వస్తే ఆ రోడ్డంతా రొచ్చు..రొచ్చు..!

- స్కూలుకు పిల్లలు వెళ్లాలంటే నరకం
- అయిదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యంలో రోడ్లు

జమ్మలమడుగు, ఆగస్టు 11: జమ్మలమడుగు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. అందులో ప్రధానంగా మోరగుడి గ్రామం వద్ద నుంచి మైలవరం వెళ్లే ప్రధాన రోడ్డు దొమ్మరనంద్యాల ఎస్సీ కాలనీ రోడ్డుపై కొద్దిపాటి వర్షం వచ్చినా నీళ్ల నిలిచి అసౌకర్యంగా మారుతోంది. అలాగే గ్రామంలోని కాపువీధి ఏళ్లగా స్థానికులు పట్టించుకోకనో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధాన సెంటర్ నుంచి కాపువీధిలో వెళ్లాలంటే నరకప్రాయంగా ఉంటుంది. ఎప్పుడు కొద్దిపాటి వర్షం కురిసినా రొచ్చు రొచ్చుగా ఉంటుంది. నడిచి వెళ్లేవారు బురద తొక్కుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అలాగే శివారెడ్డి కాలనీకి వెళ్లే దారి మరింత దారుణంగా ఉంది. ఆ రోడ్డులో వర్షం వస్తున్న సమయంలోకానీ, తర్వాత మోకాళ్లలోతు నీరు నిలబడి ఉంటాయి. వర్షపునీరు ఆరిపోవాలంటే దాదాపు నెల రోజులు సమయం పడుతుంది. ఇలాంటి దుస్థితిలో శివారెడ్డి కాలనీలోని సుమారు 300 గృహాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం వైసీపీ నాయకులు గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే ఆ ప్రాంత ప్రజలు కాపువీధిలోని కొందరు కార్యకర్తలు, నాయకులు రోడ్డు సమస్యను తెలియజేశారు. త్వరలో రోడ్డు నిర్మిస్తామని చెప్పి పరిపాలన అంతా పూర్తయినా రోడ్డు మాత్రం నిర్మించలేకపోయారు. దీంతో ప్రజలు వైసీపీవారిపై ఆగ్రహం వ్యక్తం చేసి గత ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తిరుగుబాటు చేశారు. ప్రస్తుతం రోడ్డు దారుణంగా మారింది.

అయిదేళ్ల పాలనలో వైసీపీ నిర్లక్ష్యం చేయబడ్డ రోడ్లు దారుణంగా మారాయి. ప్రస్తుతం ఆ వీధిలో డ్రైనేజీ కాలువలు లేవు. రోడ్డు సక్రమంగా లేక వర్షపునీరంతా రోడ్డుపైనే ఆగడం, ప్రజలకు నడిచి వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వర్షం వచ్చినప్పుడు ఆ రోడ్డులో నడిచి పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





మైలవరం వెళ్లే దారిలో దొమ్మరనంద్యాల-ఎస్సీ కాలనీ ప్రధాన రోడ్డులో నిలిచిన వర్షపునీరు, దొమ్మరనంద్యాల పాఠశాల ఎదురుగా రోడ్డుపై ఉన్న ఇసుక దంప్



అధ్వానంగా ఉన్న దొమ్మరనంద్యాల, శివారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి

మైదుకూరు డీఎస్పీగా రాజేంద్రప్రసాద్



మైదుకూరు రూరల్ ఆగస్టు 11 : మైదుకూరు డీఎస్పీగా రాజేంద్రప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు.కడప ఇంటెలిజెంట్స్ విభాగంలో పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ మైదుకూరు డీఎస్పీగా బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తామని తెలిపారు.

బద్వేలు రూరల్ సీఐగా నాగభూషణం యాదవ్




బద్వేలు రూరల్, ఆగస్టు 11 : బద్వేలు రూరల్ సీఐగా నాగభూషణయాదవ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా ఆత్మకూరులో సీఐగా పని చేస్తూ సాధారణ బదిలీపై బద్వేలు రూరల్ సీఐగా వచ్చారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు.

బి.మఠం ఎస్ఐగా చంద్రశేఖర్



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 : బ్రహ్మంగారిమఠం మండల ఎస్ఐగా ఆదివారం జె.చంద్రశేఖర్ పూర్తి స్థాయిలో బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్ కొండాపురం బదిలీ కావడంతో బ్రహ్మంగారిమఠం మండలానికి నూతన ఎస్ఐగా జె.చంద్రశేఖర్ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

బి.కోడూరు ఎస్ఐగా కేసీ రాజు



బి.కోడూరు, ఆగస్టు 11 : బి.కోడూరు మండల నూతన ఎస్ఐగా కేసీ రాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అట్లూరు మండల ఎస్ఐగా విధులు నిర్వహిస్తుండేవారు. అట్లూరు నుంచి బి.కోడూరుకు బదిలీ అయి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ జయరాములు కడప రిమ్స్‌కు బదిలీ అయినట్లు తెలిపారు.

ప్రశాంతతకు భంగం వాటిల్లితే చర్యలు

కొండాపురం, ఆగస్టు 11 :ప్రశాంతతకు భంగం వాటిల్లితే చర్యలు తప్పవని జమ్మలమడుగు డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. మండలంలోని టీకోడూరు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇటీవల గ్రామంలో దాడులు జరిగిన నేపథ్యంలో ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, అలా కాకుండా లేనిపోని గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ విద్యాసాగర్ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ పట్టివేత

ఖాజీపేట, ఆగస్టు 11: కొద్ది రోజులుగా పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి ఖాజీపేటలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున కస్తూర్బాగాంధీ పాఠశాల సమీపంలో స్కూటర్‌పై వెళుతున్న వారిపై అనుమానం రావడంతో పోలీసులు వెంబడించారు. అయితే స్కూటర్ పడవేసి ముగ్గురు పరుగెత్తారు. అందులో ఒకరిని ఏఎస్ఐ నాగరాజు, హోంగార్డు ఓబుళరెడ్డి వెంబడించి పట్టుకున్నారు. మిగతావారికోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

బద్వేలు, ఆగస్టు 11: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీకి డ్రైనేజీల పూడిక తీసేందుకు రూ.50లక్షల నిధులు కేటాయించిందని అయితే మున్సిపల్ కమిషనర్ టెండర్లు పిలవకుండా తన బినామీలతో పనులు చేయించడం దారుణమని వాటిపైన శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల నాయకులతో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పనులకు బద్వేలు పట్టణానికి రూ.50లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందని. కేవలం మైదుకూరు రోడ్డులో మాత్రమే డ్రైనేజీ పనులు చేస్తున్నారని మిగిలిన రహదారులలో ఈ పూడిక తీత పనులు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈ పూడిక తీత పనులకు టెండర్లు పిలవకుండా కమిషనర్ తన బినామీ కాంట్రాక్టర్ ద్వారా పనులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, నాగార్జున, రాయప్ప, సుబ్బరాయుడు, మోక్షమ్మ, రామలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

మైదుకూరు రూరల్ ఆగస్టు 11 : మండలంలోని సర్పంచ్,కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ విధులు,బాధ్యతలు,పారిశుధ్య నిర్వాహన,స్ట్రీట్‌లైట్లు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పుట్టా



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 : బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల పంచాయతీ చీకటివారిపల్లె గ్రామంలో జరిగిన వివాహ వేడుకలు, దిరసవంచ పంచాయతీ రామచంద్రాపురం చౌటపల్లె గ్రామంలో జరిగిన వివాహ వేడుకలకు మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సీనియర్ నేత రామచంద్రనాయుడు, ముడుమాల పోలిరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, మిల్లు శ్రీను, ముద్దుక్రిష్ణమనాయుడు, లగసాని గంగరాజు. లగసాని వీరయ్య, వెంకటేశ్‌నాయుడు, భూతప్పనాయుడు, కొడపాటి లక్ష్మినాయుడు, కొడపాటి భీమానాయుడు, బోయపాటి సుమన్ గ్రామ, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిసన్నిధిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 : వీరబ్రహ్మేంద్రస్వామిని ఆదివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ తమ కుమారుని తలవెంట్రుకలు ఇచ్చి మొక్కుబడి చెల్లించుకున్నామన్నారు. అనంతరం దేవస్థానం యాజమాన్యం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించారు. అక్కడ జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం పూర్వపు మఠాధిపతుల కుమారులు వెంకటాద్రిస్వామి, దత్తాత్రేయస్వామి, శ్రీఈశ్వరీదేవి మఠం పూర్వపు మఠాధిపతుల కుమారుడు చెరువుపల్లె వీరకుమారస్వామివారి కుమారులు తేజ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన అన్న క్యాంటీన్

జమ్మలమడుగు, ఆగస్టు 11: జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన ఈనెల ఆగస్టు 15వ తేదీ అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగనున్నాయి. అందులో భాగంగా గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇదే ప్రదేశంలో అన్నా క్యాంటిన్ ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అయిన తర్వాత శరవేగంగా ఇచ్చిన మాట ప్రకారం అన్నా క్యాంటిన్లు తెరిచేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగులో అన్నా క్యాంటిన్ గత 15 రోజుల నుంచి పనులు ప్రారంభించి క్యాంటిన్ సిద్ధం చేశారు. పూర్తి పనులన్నీ సోమవారం నాటికి సిద్ధం చేస్తున్నారు .ఈనెల 15వ తేదీ అన్నాక్యాంటిన్ ప్రారంభించేందుకు వేగంగా పూర్తి చేసినట్లు అక్కడున్నవారు తెలిపారు.



ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



గూడుమస్తాన్‌వలి దర్గా సమీపాన ట్యాంకర్ల వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

జమ్మలమడుగు, ఆగస్టు 11: ఈనెల 9వ తేదీ నుంచి రెండు రోజులపాటు జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో దొమ్మరనంద్యాల గ్రామం ఫిల్టర్ వాటర్ కేంద్రం వద్ద శుభ్రం చేయు కారణంగా రెండు రోజులపాటు నీళ్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలియజేశారు. అందుకు ప్రజలకు పట్టణంలోని అన్ని వీధుల్లో ఇబ్బంది కలుగకుండా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్టు తరుపున సుమారు 20 ట్యాంకర్లతో పట్టణంలోని అన్ని వీధులకు సరఫరా చేశారు. గత మూడు రోజులుగా ట్యాంకర్లతో నీళ్లను సరఫరా చేశారు. ఎక్కడైనా నీళ్లకు ఇబ్బంది కలుగకుండా అడిగినవారికి వెంటనే పంపడం, పర్యవేక్షణ చేయడం, టీడీపీ నాయకులు, మండల అధ్యక్షులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, పర్యటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు జంబానా దాదాపీర్, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో సరస్వతి విద్యాపీఠం అనంతపురం కమిటీ స్థాయి ఖేల్‌కుద్ పోటీల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి, సరస్వతి విద్యాపీఠం అనంతపురం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, పాఠశాల అధ్యక్షుడు బుశెట్టి రాజశేఖర్, నిర్వాహక కమిటీ అధ్యక్షులు యల్లారెడ్డి, కేశవరెడ్డి, రామచంద్రయ్య, కాశీప్రసాద్‌రెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

లారీ, సుమో ఢీ : పలువురికి గాయాలు


ఖాజీపేట, ఆగస్టు 11: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె సమీపంలో సుమోను లారీ ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వల్లూరు నుంచి మొరాయిపల్లెకు మళ్లిపెళ్లికి వెళుతున్న సుమోను కడప నుంచి మైదుకూరుకు వెళుతున్న లారీ ఢీకొనడంతో సుమో బోల్తాపడింది. అంతేకాక లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో చూసిన వారు వెంబడించి మైదుకూరు సమీపంలో పట్టుకున్నారు. సుమోలో ఎనిమిది మంది ఉండగా స్వల్పగాయాలు కావడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

15 నుంచి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 : ఈ నెల 15 నుంచి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని టీడీపీ నాయకులు లక్ష్మీనాయుడు, సుమన్, విజయ్, బీమానాయుడు తెలిపారు. మండలంలోని ఎన్.గొల్లపల్లె (నందిపల్లె) గ్రామంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు అందజేసినట్లు వారు తెలిపారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు





నిరుపయోగంగా ఉన్న తొట్లు, పగిలిన తొట్లు

చాపాడు, ఆగస్టు 11 : నాలుగేళ్లగా మండలంలో పలు గ్రామాల వద్ద నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు ఈ కేంద్రాలను నిర్మించాయి. చాపాడు, లక్ష్మీపేట, వెదురూరు, సోమాపురం, పల్లవోలు, ఖాదర్‌పల్లె, అన్నవరం, మరో 15 గ్రామ పంచాయతీల్లో కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల వద్ద కసువు వేసుకునేందుకు సిమెంటు తొట్లు కూడా నిర్మించారు. గ్రామాల్లో లభించే వ్యర్థపదార్థాలు అయిన కసువు, రబ్బర్లు, చెప్పులు, కాగితాలు , వరిగడ్డి వంటివాటితో సేంద్రియ ఎరువులు తయారు చేయాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను నెలకొల్పారు. ఈ సిమెంటు తొట్లలో వానపాములను వదిలి ఈ వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేయాల్సి ఉంది. ఈ ఎరువులను కేజీ ప్రకారం రైతులకు విక్రయించాల్సి ఉంది. ఈ సేంద్రియ ఎరువులు రైతులు పసుపు, పూలతోటలు, వేరుశనగ, పండ్ల తోటలకు వినియోగిస్తే పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలాంటి మంచి ఉద్దేశ్యంతో ఈ కేంద్రాలను నిర్మించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు వానపాములను కొనుగోలు చేయలేకపోతున్నారు. లక్ష్మీపేట, పల్లవోలు గ్రామాల్లోని కేంద్రాల్లో మాత్రమే వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. ఈ కేంద్రాలు కూడా నాలుగు నెలల నుంచి మూతపడ్డాయి. క్లాప్ మిత్రలకు జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదు. సుమారు రెండేళ్లపాటు జీతాలు ఇవ్వకపోడంతో క్లాప్‌మిత్రలు పనిచేసేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఈ పథకం లక్ష్యం నెరవేరలేదు. ఒక్కొక్క కేంద్రాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలతో నిర్మించారు. ప్రతి గ్రామంలో సిమెంటు తొట్లు కూడా ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోని కసువు ఈ తొట్లలో నింపుతున్నారు. ఈ కసువును క్లాప్ మిత్రలకు కేంద్రాలకు చేర్చడంలేదు. జీతాలు సక్రమంగా రానందున వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి కసువు వేసుకునేందుకు డస్ట్‌బిన్‌లు సరఫరా చేసింది. కానీ అధికారులు ఈ డస్ట్‌బిన్‌లను ఇంకా కొన్ని గ్రామాలకు పంపిణీ చేయలేదు. కొన్నేళ్ల నుంచి ఈ కేంద్రాల పరిస్థితిని జిల్లా అధికారులు పట్టించుకోలేదు. దీంతో అది నామమాత్రంగా పడి ఉన్నాయి. గ్రామాలు పరిశుభ్రంగా కూడా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ కేంద్రాలు పనిచేయకపోవడంతో గ్రామాలు అపరిశుభ్రంగా నెలకొని ఉన్నాయి. దీంతో మండల వాసులు ఈ కేంద్రాల పనితీరు బాగోలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు నిధులు విడుదల చేసి కేంద్రాలు పనిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగునీరు

- కంపుకొడుతున్న ఏరువాకగంగమ్మ ఆలయ వీధి



ఎర్రగుంట్ల, ఆగస్టు 11: ఏరువాకగంగమ్మ ఆలయ వీధిలో మురుగునీరు కంపుకొడుతోంది. వర్షపు నీటితోపాటు రోజు ఇళ్లలోనుంచి వదిలే నీరు రోడ్లపైనే ఆగుతున్నాయి. దీంతో ఆ వీధి కంపుకొడుతోంది. రోడ్డు సక్రమంగా లేదని ఇళ్లముందు మట్టిని వేసుకోవడంతోపాటు, ఇళ్లు శుభ్రం చేసిన నీరు, ట్యాంకులు నిండితే వచ్చే నీరంతా రోడ్లపైకే వదులుతున్నారు. దీంతో నీరు ఎటూ వెళ్లక రోడ్డుపైనే ఆగిపోతోంది. ఇదే వీధిలో ఉండే ఏరువాకగంగమ్మ ఆలయానికి వెళ్లే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మహిళా భక్తులు వెళ్లేందుకు వీల్లేకుండా ఉంది. మురుగునీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి వుంది. దీంతో జారి కింద పడిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే ద్విచక్రవాహన దారులకు ఇది నరకప్రాయంగా మారింది. మధ్యలో గుంతలు, రాళ్లు వుండటంతో కిందపడిపోతున్నారు. అధికారులకు ఎన్నోసార్లు తెలిపినా తూతూ మంత్రంగా స్పందిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూడటంలేదు. వీధిలో కొత్త సీసీ రోడ్డుతోపాటు, ఇరువైపులా డ్రైనేజీ వేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా నిత్యం వందలాది మంది భక్తులు వెళుతున్నారు. అమ్మవారి ఊరేగింపులకు, ఇతర ఉత్సవాలకు వేలసంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఈ ప్రాంతంలో కంపుకొడుతుండటంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వుంది. కనీసం ఆలయాలకు వెళ్లే రస్తాలైనా బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.